ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది శభాష్

- బస్టాండ్‌లో మరిచిపోయిన బ్యాగు అప్పగింత

తెలంగాణచౌక్,జూలై 25: జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌లో మూడో బస్ పాయింట్ వద్ద గురువారం అర్చన అనే ప్రయాణికులురాలు బ్యాగ్ మరిచి పోయింది. గుర్తించిన సెక్యూరిటీ గార్డు కవిత బ్యాగ్‌ను స్టేషన్ మేనేజర్ అంజయ్యకు అప్పగించింది. బ్యాగ్ ఉన్న ఆధారాలతో ప్రయాణికురాలికి సమాచారం అందించారు. సెక్యూరిటీ ఏఎస్ఐ లక్పతి సమక్షంలో బ్యాగును అర్చనకు అప్పగించారు. కాగా బ్యాగులో విలువైన పత్రాలు ఉన్నాయని తిరిగి అప్పగించిన ఆర్టీసీ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, నిజాయతీ చాటిన సెక్యూరిటీ సిబ్బంది కవితను ఆర్టీసీ అధికారులు అభినందించారు.

ఎడతెగని ముసురు

- స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు
- రంగంలోకి డీఆర్ఎఫ్ బృందాలు
- నిలిచిన నీరు తొలగింపు

రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని తొలగిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

కార్పొరేషన్, జూలై 25: నగరాన్ని ముసురు వాన వీడడంలేదు. వారం రోజులుగా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. బుధవారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురిసింది. రోడ్లపై వాననీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లోని నీరు ఇండ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బల్దియా డీఆర్ఎఫ్ బృందాలు ఆయా ప్రాంతాలకు చేరుకొని రోడ్లపై నిలిచిన నీటి డ్రైనేజీలకు పంపించారు. కాగా ఆయా ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించి నీటిని తరలించారు. నగరంలో వర్షాలతో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని బల్దియా అధికారులు తెలిపారు. సహాయక చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు.

కిసాన్‌నగర్‌లో కూలిన ఇల్లు

నగరంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో 3వ డివిజన్ కిసాన్‌నగర్‌లో బండ లక్ష్మీనారాయణకు చెందిన పాత ఇల్లు గురువారం కూలిపోయింది. స్థానిక కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ రమేశ్, బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారి సంధ్య కూలిన ఇంటిని పరిశీలించారు. నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు పక్కన గుంతల్లో నిలిచిన వరదనీరు

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జూలై 25: ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కరీంనగర్ జడ్పీ క్వార్టర్ల సముదాయంలోని సమావేశ మందిరంలో వన మహోత్సవంపై జిల్లాలో ని అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్డీవో, అటవీ, ఎక్సైజ్, ఆర్ అండ్‌బీ తదితర శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వారంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నుంచి ప్రతి రోజు ఉన్నతాధికారులు దీనిపై సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. రహదారుల వెంట రైతు వేదికలు, అంగన్ వాడీ సెంటర్లు, గ్రామాల్లో మొక్కలు నాటాలని సూచించారు.

సేవలు వెలకట్టలేనివి..

గ్రామాలు, పట్టణాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ కొనియాడారు. గురువారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన పారిశుధ్య కార్మికుల క్షేమం– గౌరవం అనే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల నిధుల నుంచి ఆరోగ్య బీమా చేస్తామని తెలిపారు. కార్మికులు రక్షణ కవచాలను ధరించి పని చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎఫ్‌వో బాలామణి, యూనిసెఫ్ స్టేట్ ప్రతినిధి ఫణిందర్ కుమార్, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్‌స్వామి ఎస్ఎస్ఎన్ వేణు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఉద్యాన వనాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

వైరాగ్యం ప్రభాకర్‌కు గౌతమి నంది పురస్కారం

కమాన్‌చౌరస్తా, జూలై 25 : కరీంనగర్ కు చెందిన కవి రచయిత, భవానీ సాహితీ వేదిక వ్యవస్థాపకుడు వైరాగ్యం ప్రభాకర్‌ను గౌతమి నంది పురస్కారానికి ఎంపిక చేసినట్లు విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు ఎస్వీఆర్ వెంకటేశ్ , గౌతమేశ్వర గోసంరక్షణ సమితి అధ్యక్షుడు ఆకుల విద్యాసాగర్ గురూజీ తెలిపారు. ప్రభాకర్ సాహితీ సేవలను గుర్తించి ఉత్తమ సాహితీ గురు బిరుదుతో పాటు ఈ జాతీయ స్థాయి అవార్డు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు పురస్కారం ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

నిధులు విడుదల చేయాలి

కలెక్టరేట్, జూలై 25 : కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీలకు కేటాయించిన రూ. 3 వేల కోట్లను విడుదల చేయాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. షాదీ ముబారక్, టెమ్రీస్, మైనార్టీ విదేశీ విద్య స్కాలర్ షిప్ పథకం, వీధి వ్యాపారులకు, పేద మైనార్టీలకు 100 శాతం సబ్సిడీపై రుణాలు, డ్రైవర్ కం ఓనర్ వాహన పథకం, గృహలక్ష్మి లో దళితులకు కేటాయించినట్లు మైనార్టీలకు రూ. ఆరు లక్షలు ఇవ్వాలన్నారు.

రేషన్ డీలర్ మృతి

మానకొండూర్, జూలై 25: మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ ఉండింటి శివకుమార్ (34) అలియాస్ టిల్లు దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. శివకుమార్ బుధవారం ఆకస్మాత్తుగా తీవ్ర ఆస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. శివకుమార్ మృతితో గ్రామంలో విషాదం నెలకొన్నది.

బదిలీ టీచర్లకు సన్మానం

చొప్పదండి, జూలై 25: మండలంలోని ఆర్నకొండ జడ్పీ స్కూల్‌లో పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ, రజని, అనిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. హెచ్ఎంలు శ్రీనివాస్, నర్మద ఉన్నారు.

ఐద్వా శిక్షణ తరగతులు

తెలంగాణచౌక్,జూలై 25: నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్‌మిశ్రా భవనంలో శుక్రవారం నుంచి సోమవారం వరకు అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి గురవారం తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శిక్షణ తరగతుల ఏర్పాట్లపై సమీక్షించారు.

గొర్రెలు పంపిణీ చేయాలి

తెలంగాణచౌక్,జూలై 24: రాష్ట్రంలోని గొర్లకుర్మలకు రెండో విడుత గొర్రెలు పంపిణీ చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్యయాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 20 శాతం ఉన్న యాదవ్‌లకు కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్యయాదవ్, ప్రవీణ్‌యాదవ్, కమలాకర్ యాదవ్, తిరుపతి పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి చేయూత

చిగురుమామిడి, జూలై 25: మండలంలోని రామంచకు చెందిన కందుకూరి యాదగిరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. నిరుపేద అయిన అత డి కుటుంబానికి తనతో చదువుకున్న 2002 టెన్త్ బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. కుటుంబస భ్యులకు గురువారం రూ. 30 వేలు అందజేశారు. బాల్య మిత్రులు జక్కుల బాబు, ముంజ ప్రకాష్, పోతరాజు మునీందర్, ములుపాల నరసయ్య, శ్రీనివాస్, కిరణ్ కుమార్, సదానందం ఉన్నారు.

వనమహోత్సవం

సైదాపూర్, జూలై 25: సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ ఉన్నారు.

రజనీకాంత్‌రెడ్డికి సన్మానం

కరీంనగర్ రూరల్, జూలై 25: కరీంనగర్ రూరల్ రెవెన్యూ ఆర్ఐగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రజనీకాంత్‌రెడ్డిని రేషన్ డీల్లరు గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, రేషన్ డీలర్లు మునీరాజ్ ఉన్నారు.

ఉచిత ఐవీఎఫ్ క్యాంపునకు స్పందన

జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ బంగారు స్వామి, రజనీ ప్రియదర్శిని

విద్యానగర్, జూలై 25 : వరల్డ్ ఐవీఎఫ్, ఎంబ్రియాలజీ డేను పురస్కరించుకొని గురువారం రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత ఐవీఎఫ్ క్యాంపు విజయవంతమైంది. సీనియర్ గైనకాలజిస్ట్ డా.బంగారి రజనీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపును రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బంగారి స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.బంగారి రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలో సుమారు 15 శాతం మంది సంతానలేమితో బాధపడుతున్నారన్నారు. ఆలస్యపు వివాహాలు, వృత్తి పరమైన ఒత్తిడి, జంక్ ఫుడ్, స్థూలకాయం, ఆల్కహాల్, పొగ తాగడం, వాతావరణ మార్పులే కారణమని విశ్లేషించారు. ఉత్తర తెలంగాణాలోనే రజనీ ఫెర్టిలిటీ సెంటర్ అత్యధిక సక్సెస్ రేటు కలిగి ఉండడంలో సిబ్బంది పాత్ర ఎంతో ఉందన్నారు. బంగారి స్వామి మాట్లాడుతూ రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో చికిత్స అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డా. దినకర్ తాటిమట్ల, జనరల్ ఫిజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, ఎంబ్రియాలజిస్ట్ డా.ప్రదీప్, అనస్థీషియన్స్ డా. దామోదర్‌రెడ్డి, డా.మౌనిక, డా. అవనిజ, బయోమెడికల్ ఇంజినీర్ రతన్, హాస్పిటల్ జనరల్ మేనేజర్ అరవింద్ బాబు పాల్గొన్నారు.

చల్లూరులో మహిళా సంఘ భవనం సీజ్

వీణవంక, జూలై 25: చల్లూరులోని మహిళా సమైక్య సంఘ భవనాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో 2009 లో సంఘ భవనాన్ని నిర్మించారు. అయితే అదే గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి ప్రభుత్వ పాఠశాల భూమిలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారని నిర్మాణంలో ఉండగానే కోర్టులో పిటీషన్ వేశారు. 2009 నుంచి ఈ భవనంలో 98 సంఘాలకు చెందిన 1200 మంది సభ్యులు కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. హైకోర్టు తీర్పు మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్ఐ రవి చల్లూరు మహిళా సమైక్య సంఘ భవనానికి గురువారం వెళ్లగా శ్రీపూజిత, మానస, అమృతవర్షిణి సంఘాలకు చెందిన వీవోలు ఆర్ఐ రవికి అప్పగించగా సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు. ఈ భవన నిర్మాణ విషయంలో అప్పటి పీఆర్ డీఈ, పాఠశాల హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు రఘునాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు జైలుకు కూడా వెళ్లారు.

భవనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

వాణీనికేతన్‌లో బోనాల సందడి

నెత్తిన బోనాలతో మహిళా టీచర్లు, విద్యార్థినులు

కొత్తపల్లి, జూలై 25 : వాణీనికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారు, పోతరాజుల వేషధారణతో ఆకట్టుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో జ్యోతినగర్‌లోని గుడి వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. స్కూల్ డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ కోట లక్ష్మారెడ్డి ఉన్నారు.

మన్నెంపల్లి జడ్పీ స్కూల్‌లో..

తిమ్మాపూర్ రూరల్,జులై 25: మండలంలోని మన్నెంపల్లి జడ్పీ స్కూల్‌లో శిక్ష సప్తాహంలో భాగంగా గురువారం ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు నెత్తిన బోనాలతో సందడి చేశారు. హెచ్ఎం మోహన్ ఉన్నారు.

జిల్లాలో చిన్నజీయర్ స్వామి

కమాన్‌చౌరస్తా, జూలై 25 : జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి పరమపదోత్సవానికి తిద్రండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ వారి కుటుంబ సభ్యులతో పాటు, పండితులు ఉన్నారు.

మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

అధికారం కోసమే మోడీ ఆరాటం

- అందుకే బడ్జెట్‌లో ఏపీ, బిహార్‌కు పెద్దపీట
- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండితో ఒరిగేదేమీలేదు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తెలంగాణచౌక్, జూలై 25: అధికారాన్ని కాపాడుకొనేందుకే ప్రధాని మోడీ ఆరాట పడుతున్నాడని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. అందుకే ఏన్డీఏ భాగస్వామ్య పక్షాల చేతిలో కీలుబొమ్మలా మారి ఏపీ, బిహార్‌కు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారని మండిపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా అధ్యక్షుడు మర్రి వెంకటస్వామి అధ్యక్షతన రెండు రోజుల పాటు జరగనున్న ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను గురువారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ పట్ల ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరిగిపోతుందన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి సాధిచేమీలేదని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కారుకు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి మౌనంగా ఉండడం సరికాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సీపీఐని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు కేదారి, మల్లేశం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యాలయ ఇన్‌చార్జి సదాశివ. రాజు తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఒకరి దుర్మరణం

రమేశ్ (ఫైల్)

రాంనగర్, జూలై 25: భారీ వాహనదారుడి నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైపోయింది. కరీంనగర్ మండలం నగునూరు సమీపంలో ఎలాంటి సూచికలు లేకుండా భారీ వాహనాన్ని రోడ్డుపై నిలిపించడంతో దానిని గమనించని ఒక కారు బుధవారం అర్ధరాత్రి వెనకనుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నగరంలోని సాయినగర్‌కు చెందిన తాటికొండ రమేశ్‌గా గుర్తించి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగు చూసింది. చొప్పదండి వాస్తవ్యుడైన రమేశ్ అక్కడే బుక్ స్టాల్ నిర్వహిస్తూ కరీంనగర్‌లో స్థిరపడ్డాడు. రోజు చొప్పదండికి వెళ్లి వచ్చే రమేశ్ బుధవారం తిరిగివస్తూ అనంతలోకాలకు వెళ్లడం ఆ కుటుంబాన్ని శోక సముద్రంలో కి నెట్టింది. బుధవారం రాత్రి పది గంటలకు కారులో బయల్దేరిన రమేశ్ నగునూరు సమీపానికి చేరుకునేసరకి నడి రోడ్డుపై నిలిపి ఉంచిన భారీ వాహనాన్ని వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు నుజ్జు నుజ్జు కాగా రమేశ్ దుర్మరణం చెందాడు. స్థానికులు డయల్ 100 ద్వారా సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందినట్లుగా నిర్ధారించుకొని దర్యాప్తు ప్రారంభించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ ప్రదీప్ తెలిపారు.

రామడుగు వాగుపై వంతెనను ప్రారంభించాలి

నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రామడుగు, జులై 25: రామడుగు వాగుపై నిర్మించిన వంతెనను ప్రారంభించాలని బీజేపీ నాయకులు గురువారం వంతెన వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ వంతెనను ప్రారంభించాలని నిరసనకు దిగిన మేడిపల్లి సత్యం ఎమ్మెల్యే కాగానే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కొత్త వంతెనను తక్షణం ప్రారంభించనట్టయితే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ భాస్కర్ బీజేపీ నాయకులకు హామీ ఇస్తూ త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా ఎస్ఐ సురేందర్ వంతెనవద్దకు చేరుకొని బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వొంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పొన్నం శ్రీనివాస్‌గౌడ్, బండ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోడి రవీందర్, మండల ప్రధాన కార్యదర్శులు పోచంపల్లి నరేశ్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దారి ఇలా.. ప్రయాణం సాగేది ఎలా..!

ఇరుకు రోడ్డులో నిలిచిపోయిన లారీ

శంకరపట్నం, జూలై 25: కేశవపట్నం నడిబొడ్డున ఇరుకైన రోడ్డుతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. అధికారుల హామీలు నీటిమూటలవుతున్నాయి. బుధవారం గ్రామంలోని రథశాల కూడలి వద్ద ఓ లారీ రోడ్డు పక్కన కుంగి నిలిచిపోవడంతో గంటల కొద్దీ వాహనదారులు అవస్థలు పడ్డారు. కేశవపట్నం మీదుగా కరీంపేట్, మొగిలిపాలెం, హుస్నాబాద్, సిద్దిపేట, హైదరాబాద్ వైపు రాకపోకలు కొనసాగిస్తారు. కాగా గ్రామంలోని రోడ్డు దుస్థితిపై సోషల్ మీడియా వేదికగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు సమస్య తీవ్రతను గుర్తించి రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్ పోర్ట్ పోయినది

ముత్యం కుమార్, S/o: స్వామి, గ్రా|| తారుపల్లి, మం|| కాల్వ శ్రీరాంపూర్, జి|| పెద్దపల్లి అను నాయొక్క పాస్ పోర్ట్ (No: K4135142) 5 నెలల క్రితం మా ఇల్లు కూల్చివేసి మరో ఇంటికి షిఫ్ట్ అయ్యేటప్పుడు పోయినది. దొరికిన వారు సంప్రదించండి.

సెల్: 96033 50915

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

హుజూరాబాద్ ఏసీపీ ఆఫీసులో సీపీ తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

రాంనగర్, జూలై 25: హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సమీక్షించి వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని నిర్దేశించారు. దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టబడిన నూతన చట్టాల అమలు జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా డివిజన్ పరిధి పోలీస్‌స్టేషన్‌లోని అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వెంట ఏసీపీ శ్రీనివాస్ ఉన్నారు.

వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలి

కార్పొరేషన్, జూలై 25: ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా నగరంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని నగర కమిషనర్ ప్రపుల్ దేశాయ్ అన్నారు. గురువారం ఎల్ఎండీ సమీపంలోని నర్సరీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ పంపిణీ కోసం, బ్లాక్ ప్లాంటేషన్ కోసం మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. నగరంలో స్వచ్ఛ ఆటోలు ఇంటి నుంచి చెత్త సేకరించేటప్పుడే తడి పొడి చెత్తలను వేర్వేరుగా తీసుకోవాలని సూచించారు. గురువారం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని డీఆర్‌సీసీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌సీసీ కేంద్రాన్ని పరిశుభ్రంగా మార్చి మహిళా సంఘానికి అప్పగించాలన్నారు. తడి చెత్తను కంపోస్ట్ సెంటర్లకు తరలించాలని తెలిపారు. ఇక్కడ ఎస్ఈ మహేందర్ ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో కరీంనగర్‌కు ఇచ్చింది గాడిదగుడ్డే

విద్యానగర్, జులై 25: రాష్ట్ర బడ్జెట్‌లో కరీంనగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు గురువారం తెలంగాణచౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడిలా కనిపిస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి లేదని అందుకే జిల్లాకు బడ్జెట్‌లో గాడిదగుడ్డు తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, వాసుదేవా రెడ్డి, ప్రసాద్, కళ్యాణ్‌చంద్ర, లోకేశ్, సంపత్, కార్పొరేటర్లు శ్రీనివాస్, అనూప్, జి తేందర్. రమణారెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి